# పోచమ్మ తల్లికి బోనాలు

దేవరుప్పులలో బోనాలతో వస్తున్న మహిళలు

జనగామలో పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

సీతారాంపురంలో బోనంతో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కోమల్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు

- గ్రామ దేవతలకు భక్తులు మొక్కులు
- సీతారాంపురంలో బోనమెత్తిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి
- జిల్లా వ్యాప్తంగా పోచమ్మ, ఎల్లమ్మ, బీరప్ప ఆలయాల్లో వేడుకలు

జనగామ చౌరస్తా/జనగామ రూరల్/బచ్చన్నపేట/నర్మెట/రఘునాథపల్లి/దేవరుప్పుల/లింగాల ఘనపురం, ఆగస్టు 25 : జిల్లా కేంద్రంతోపాటు గ్రామాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. జనగామ పట్టణంలో డప్పుచప్పుళ్లతో మహిళలు పోచమ్మ ఆలయం వరకూ వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి దంపతుల ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించారు. జనగామ మండలంలోని ఆయా గ్రామాల్లో పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, గడిమైసమ్మ, బీరప్పకు బోనాలు సమర్పించారు. ఆలయాల వద్ద యాటపోతులను బలిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో గ్రామ దేవతలైన పెద్దమ్మ, మాతమ్మకు, ఎలమ్మ తల్లులకు పూజలు చేశారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది. అందరినీ చల్లగ చూడు తల్లీ అంటూ భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు చేసి నైవేద్యంతో కొత్త చీరలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. పంబాల కళాకారుల డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో గ్రామ దేవతల ఆలయాల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించారు. నర్మెట మండల కేంద్రంతో పాటు మచ్చుపహాడ్, వెల్దండ, హన్మంతాపూర్‌లో పోచమ్మ, పెద్దమ్మ, మహంకాళీ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లతో మహిళలు గ్రామ దేవతల ఆలయాలకు వరకు వెళ్లి మొక్కులు చెల్లించారు. పాడి పంటలు బాగుండాలని అమ్మవార్లను కోరుకున్నారు. రఘునాథపల్లి మండలం కోమల్ల, వెల్ది గ్రామాల్లో పోచ్చమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. దేవరుప్పులలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. వందలాదిగా మహిళలు అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. పూజారులైన కుమ్మరి కులస్తులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. సీతారాంపురంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించగా ముఖ్యఅతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే బోనమెత్తి అమ్మవారికి పూజలు చేశారు. పోచమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాం, మాజీ మండల అధ్యక్షుడు ఉప్పల సురేశ్‌బాబు, మాజీ సర్పంచ్ రెడ్డి రాజుల రమేశ్, గ్రామ అధ్యక్షుడు వరికెల రతన్ పాల్గొన్నారు. లింగాలఘన పురం మండల కేంద్రంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. రైతులు, మహిళలు ఎడ్లబండ్లపై బోనాలను తీసుకెళ్లారు. గ్రామపంచాయితీ కార్యాలయం నుంచి పోచమ్మ, మహంకాళీ ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

బచ్చన్నపేటలో బోనాలు తీసుకొస్తున్న భక్తులు

వెల్దండలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

శామీర్‌పేటలో పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న ముదిరాజులు

దుర్గామాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## దుర్గామాతను దర్శించుకున్న రాజయ్య

చిల్పూరు, ఆగస్టు 25 : మండలంలోని శ్రీపతిపల్లిలో దుర్గామాత ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ చల్లగా చూడు తల్లీ అంటూ మొక్కులు సమర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషా మనోజ్‌రెడ్డి కవల పిల్లలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

**దుర్గామాతకు ఆభరణాలు సమర్పించిన కొండా మురళీధర్‌రావు**

దుర్గామాత అమ్మవారికి రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీపతిపల్లిలో గతంలో తమ సినిమాకు సంబంధించిన షూటింగ్ జరిగినప్పుడు అమ్మవారికి బంగారు ఆభరణాలు చేయిస్తానని మొక్కుకున్నందున నేడు చెల్లించినట్లు వివరించారు. తాను రాజకీయాలు మాట్లాడేందుకు ఇక్కడికి రాలేదన్నారు. తనను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏనాడు ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మాచర్ల గణేశ్, వారాల రమేశ్, బస్వగాని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, కొయ్యడ రాందాస్, ఉడుత వెంకటనారాయణ, రంగు హరీశ్, మాలోత్ రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు బంగారు అభరణాలు అందిస్తున్న కొండా మురళీ

## యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకుర్తి, ఆగస్టు 25: మండల కేంద్రంలోని శాంతినగర్‌లో కాంత్రి యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంగునూరి మహేశ్, గౌరవాధ్యక్షుడిగా పెనుగొండ సోమేశ్వర్, ఉపాధ్యక్షులుగా సలేంద్ర శంకర్, బొద్దున సందీప్, కోశాధికారిగా కమ్మగాని సుధాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బెల్లి దిలీప్, సహాయ కార్యదర్శిగా చిట్యాల సాయి, కార్యవర్గ సభ్యులుగా గజ్జెల వెంకటేశ్వర్లు, బండి కిరణ్‌కుమార్‌గౌడ్, బండి మధుగౌడ్, పెండ్లి శోభన్ బాబు, వంగ అశోక్, సింగ నాగరాజు, ఎండీ యాకూబ్, బక్కు రాజు, వీరమనేని రాజు , సభ్యులుగా గుళ్ల రమేశ్ ,చిలువేరు గజేందర్, కత్తుల ఆంజనేయులు, బండ హరీశ్‌గౌడ్, కమ్మగాని శ్రావణ్‌కుమార్‌గౌడ్, పెనుగొండ వెంకటేశ్వర్లు, ముత్తోజు రాము ,చిలకమారి శ్రీధర్ ఎన్నికయ్యారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

## చండికా అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాలకుర్తి, ఆగస్టు 25: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం చండికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో మహిళలు అభిషేకాలు చేశారు. కుంకుమార్చనతోపాటు ఒడి బియ్యం సమర్పించారు. మంగళహారతులతో అమ్మవారికి నీరాజనం పలికారు. లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమలను వాయినంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య అర్చకులు దేవగిరి అనిల్‌శర్మ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చేయూత

నర్మెట, ఆగస్టు 25: మండల కేంద్రానికి చెందిన నక్కల యాదమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబానికి గంగం ట్రస్టు నుంచి డీసీసీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి ఆదివారం 50కిలోల బియ్యాన్ని అందించారు. గండిరామవరానికి చెందిన అక్కల పోశయ్య పాముకాటుతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ అధ్యక్షులు ప్రజ్ఞపురం శ్రీధర్, గద్దల రవి, చెవుల పరశురాములు, వడపల్లి రాజు, చెవుల కుమార్, గద్దల యాకూబ్, గద్దల కుమార్, కన్నెబోయిన రామకృష్ణ, ముడికె పరమేశ్వర్, ముక్కెర రాజేశ్, బోయిన ఐలయ్య, నక్కల రవీందర్, పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న హుస్సేన్‌నాయక్

## మృతురాలి కుటుంబానికి హుస్సేన్‌నాయక్ పరామర్శ

పాలకుర్తి, ఆగస్టు 25 : మండలంలో విస్నూరుకు చెందిన తక్కళ్లపల్లి సోమేశ్వర్‌రావు తల్లి సోమక్క ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. సోమక్క చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్రా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, నాయకులు శ్రీనివాస్‌రావు, రామకోటి, కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, ప్రధాన కార్యదర్శి మారం రవి, దేవరాజ్, పబ్బ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## కేయూలో బీపీ మండల్‌కు నివాళి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 25 : కాకతీయ విశ్వవిద్యాలయ బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సెల్ ఆధ్వర్యంలో కేయూలో బీపీ మండల్ 106వ జయంతి నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి రిజిస్ట్రార్ మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని, విలువలకు కట్టుబడిన వ్యక్తి బీపీ మండల్ అని అన్నారు. కార్యక్రమంలో వాసుదేవారెడ్డి, పొన్నాల రామయ్య పాల్గొన్నారు.

**టాయిలెట్ల నిర్మాణానికి భూమి పూజ**

కేయూ కేంద్ర గ్రంథాలయం, విశ్వవిద్యాలయంలోని ఇతర ప్రాంతాల్లో టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు, రెస్ట్‌రూమ్‌ల నిర్మాణ పనులకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి భూమిపూజ చేశారు. యూనివర్సిటీలో మొత్తం 10 టాయిలెట్ బ్లాకులు ఒక్కొక్కటి రూ.10.50 లక్షలతో నిర్మిస్తున్నామని, యూనివర్సిటీ లైబ్రరీలో 3, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 2, స్పోర్ట్స్ బోర్డులో 2, లేడీస్ హాస్టల్‌లో 1, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో 2 చొప్పున ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

## గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం

కొన్నెలో వీధి దీపాలు అందిస్తున్న శివకుమార్‌గౌడ్

బచ్చన్నపేట, ఆగస్టు 25 : గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని, ఇందుకనుగుణంగా తనవంతు సహకారం అందిస్తున్నట్లు పార్టీ నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొన్నె గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు ఆదివారం ఆయన విద్యుత్ దీపాలు అందించారు. రాత్రి వేళల్లో వార్డులన్నీ చీకట్లో ఉంటున్నందున తనవంతుగా వీధి దీపాలు ఇస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలికట్టె శ్రీనివాస్, కందకూరి నవీన్‌గౌడ్, పిట్టల బాలరాజు, సంతోష్‌రెడ్డి, రామయ్య, కారోబార్ శ్రీనివాస్, సిబ్బంది సిద్ధులు, దాసు పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాలకు అధికారుల ఏర్పాట్లు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 25 : శ్రావణమాసం చివరి వారంలో జరిగే పోచమ్మ బోనాలకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రత్యేక అధికారి స్థానికంగా పర్యవేక్షించారు. మరోవైపు మండలంలోని పలు గ్రామాల్లోనూ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు బోనాల సందర్భంగా ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పరిసరాలను శుభ్రపరిచారు. మరోవైపు పలు గ్రామాల్లో బోనాలతో పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

# హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రామా

- ఎమ్మెల్యే పల్లాను ఓర్వలేకే అక్రమ కేసులు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

జనగామ చౌరస్తా, ఆగస్టు 25 : హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రామా చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మసిఉర్ రెహమాన్, బీఆర్ఎస్ పట్టణ యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్ విలేకరులతో మాట్లాడారు. జనగామ నిఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గు చేటని మండిపడ్డారు. కొన్ని నెలలుగా తన నీలిమ హాస్పిటల్‌లో నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. అనురాగ్ యూనివర్సిటీలో ఆర్థిక స్థోమతలేని నిరుపేద విద్యార్థులకు ఫీజులు తగ్గిస్తూ ఈ ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పల్లాను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ కుట్రలకు పాల్పడుతున్నదన్నారు. హైడ్రా పేరుతో అనురాగ్ యూనివర్సిటీలో అక్రమ కట్టడాలు జరిగాయని ఎమ్మెల్యే పల్లాకు నోటీసులు పంపించడం సిగ్గుమాలిన చర్యగా వారు పేర్కొన్నారు. ప్రజల్లో పల్లాకు వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారని రెహమాన్, సందీప్ విమర్శించారు. నిత్యం ఏదో ఒక సంచలనం చేయడమే రేవంత్‌రెడ్డి పని అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలను కూల్చివేయగలరా? అని ప్రశ్నించారు. సెలబ్రిటీల నిర్మాణాలు కూల్చివేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రైతుల పంట రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రా పేరుతో హైప్ ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కబ్జా అయిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్‌ను నిలదీస్తున్నందుకే పల్లాపై కేసులు**

బచ్చన్నపేట : ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిలదీస్తున్నందుకే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో సార్లు జైలుకెళ్లిన ఉద్యమ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అక్రమ కేసులకు, బెదిరింపులకు ఆయన భయపడరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ప్రజల కోసం ఎమ్మెల్యే పల్లా పనిచేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా నీలిమా దవాఖాన ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుంటే ప్రజల తరుపున పెద్ద ఎత్తున పోరాడుతామని సతీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన వెంట నాయకులు కరికె కరుణాకర్, మినలాపురం కనకయ్య, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ**

యువజనులనుద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ భీంశర్మ

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 25 : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు అలవాటుపడొద్దని ఏసీపీ భీంశర్మ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో స్టేషన్ ఘన్‌పూర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. చిరంజీవి, గుగులోత్ హరిసింగ్ నుంచి రూ.10 వేల విలువైన నిషేధిత గుట్కాలను, సరైన పత్రాలు లేని 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించమని యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఏసీపీ భీంశర్మ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, గుడుంబా వంటి వ్యసనాలకు యువత బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. వీరిపై తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. వాహనదారులు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలతోపాటు , డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్లకు పంపే లింకులను ఓపెన్ చేయొద్దని ఆయన సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు పిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ సీఐ జీ వేణు, జనగామ రూరల్ సీఐ ఏ శ్రీనివాస్ రెడ్డి, లింగాలఘనపురం, రఘునాథపల్లి ఎస్సైలు బండి శ్రవణ్‌కుమార్, నరేశ్, ఏఎస్సై రాజమౌళి, హెడ్ కానిస్టేబుల్ మగ్దుమ్, కానిస్టేబుల్స్ కుమార్, శ్రీనివాస్, గౌస్ పాషా, రవికుమార్ పాల్గొన్నారు.

## హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం : బీఆర్ఎస్

కొడకండ్ల, ఆగస్టు 25 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి విఫలమయ్యారని కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము అన్నారు. రైతులకు రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ కాకున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని రాము తెలిపారు. నియోజకవర్గ సమస్యలు పట్టించుకోకుండా స్థానిక ఎమ్మెల్యే విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయించారని గుర్తు చేశారు. యశస్వినీరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ఎనిమిది నెలలు దాటినా నేటికీ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని రాము విమర్శించారు. చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం, కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు హామీలు కార్యరూపం దాల్చడం లేదన్నారు. ఎమ్మెల్యేకు వచ్చే గౌరవ వేతనాన్ని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఖర్చు పెడతామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేయాలని రాము డిమాండ్ చేశారు.

కొడకండ్ల పోలీస్‌స్టేషన్ ఎదుట పేకాటరాయుళ్లను చూపుతున్న పోలీసులు

## రామన్నగూడెంలో పేకాటరాయుళ్ల అరెస్ట్

కొడకండ్ల, ఆగస్టు 25 : మండలంలోని రామన్నగూడెంలో పది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, స్థానిక ఎఎస్సై కత్తి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో కునుసోత్ కిషన్, బాషిపాక నర్సింహస్వామి, ఎరుకల శ్రీనివాస్, చెవిటి జాషువా, మద్దూరి ఉమేశ్, మేకల రవి, యాట వెంకన్న, పిట్టల శ్రీను, నారగోని సోమయ్య, గుగులోత్ కిషన్ పేకాట ఆడుతుండగా వారిని అరెస్ట్ చేశామని వివరించారు. వీరి వద్ద నుంచి రూ.26,760 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వారు తెలిపారు.

**బహిరంగంగా**

## మద్యం సేవిస్తే చర్యలు : ఎస్సై

తరిగొప్పుల, ఆగస్టు 25 : బహిరంగంగా బిర్యానీ సెంటర్లలో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని బిర్యానీ సెంటర్లను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాలు, బిర్యానీ సెంటర్లలో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తామని, మార్పు రాకుంటే కేసు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

## వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

బచ్చన్నపేట, ఆగస్టు 25 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను వార్డుల వారీగా సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మల్లికార్జున్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల దృష్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఒకే కుటుంబం ఒకే వార్డులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్‌ఆచార్యా, భరత్‌కుమార్, కిరణ్‌కుమార్, కారోబార్లు శ్రీనివాస్, లలిత, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ప్రసన్న, మల్లేశం పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, ఆగస్టు 25 : మనస్తాపానికి గురై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సంతోశ్ కథనం ప్రకారం.. దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన ఊరుగొండ ప్రేమ్ కుమార్ (27), ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండేవాడు. 2020 సంవత్సరంలో భూపాలపల్లి జిల్లాకు చెందిన గజ్జెల శ్రావణితో అతడికి వివాహం జరిగింది. ఇద్దరు మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. కాగా, ఈ నెల 13వ తేదీన ఇద్దరికీ విడాకులు కాగా, జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఉరేసుకున్నాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
jobs Apply Now!
★ ప్రముఖ ఫైనాన్స్ సంస్థ యందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేయుటకు అనుభవం కలిగిన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను మరియు హన్మకొండ బ్రాంచిలో పనిచేయుటకు అనుభవం కలిగిన Lady Tele Caller కావలెను.
Cell: 8121225656, 8885558638.
NTW-320314

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-318996

TO-LET
★3 Bed Room Flat in GMR Brindavan, Waddepally, 5th Floor and Car Parking available for Rent. Contact Ph: 9849123115.
NT-331671

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565